# అమెరి'కులాసా' కథలు
## – వంగూరి చిట్టెన్‌రాజు





### - 4 -

## "దే.బ్యాం" బాధితుడి కథ -2

జరిగిన తతంగం: ఎప్పుడో, అప్పుడెప్పుడో ఇండియా వెళ్లి నప్పుడు స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా లో ఖాతా తెరిచి, మళ్ళీ ఏడాది దాటాక అదే బేంక్ కి డబ్బు తీసుకోడానికి వెళ్తే నేను ఇచ్చిన చెక్కు చెల్లదు అనీ, ఎకౌంట్ ఏక్టివ్ గా లేదు అనీ నన్ను వారు నానా ఇబ్బందులూ పెట్టారు. ఇలా లాభం లేదు అనుకుని ఏదైనా పెద్ద ప్రైవేట్ బ్యాంక్ లో ఎన్నారై ఎకౌంట్ తెరిస్తే ఇలాంటి ఇబ్బందులు ఉండవు అని ఐసిఐసిఐ అనే బ్యాంక్ లో ఎన్నారయ్ ఆపరేటింగ్, ఎనారై ఎక్స్ టర్నల్ NRO & NRE అకౌంట్లు తెరిచాను....,ఆ తెరిచిన విధం బెట్టిదనినా...తతంగం కంటిన్యూడ్...

ఐసిఐసిఐ బ్యాంక్ లో మొదటి గంట:

వందల మంది ఖాతాదార్లు, అంత కంటే ఎక్కువగా బ్యాంక్ గుమాస్తాలతో కిట కిట లాడుతున్న ప్రభుత్వం వారి స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా నుంచి బయట పడి సరి కొత్త ఐసిఐసిఐ బ్యాంక్ లోకి అడుగు పెట్టగానే ఆర్టీసి బస్ స్టాండ్ నుంచి రైల్వే స్టేషన్ కీ, లేదా రైల్వే స్టేషన్ నుంచి విమానాశ్రయానికీ...ఇంకా చెప్పాలంటే రైతు బజారు నుంచి సూపర్ మార్కెట్ లో అడుగు పెట్టిన ఫీలింగ్ వచ్చేసింది. అందుకు ఒక కారణం ఇక్కడ కిచకిచ లాడుతూ ఇద్దరు, ముగ్గురు యువ ఆడంగులు ...అంటే చిన్నప్పటి జయలలిత లాంటి వాళ్ళు కనపడ్డారు. వాళ్ళు నన్నూ, నా పక్కనే మా పిఠాపురం బాపతు మేనల్లుడినీ చూడగానే నేను ఎనారైని అనీ, వాడు కాదు అనీ కనిపెట్టేశారు. అందుకు ముఖ్య కారణం నేను తెలుగులో మాట్లాడడం అని నేను కనిపెట్టేశాను. ఇదెలా కనిపెట్టారో కానీ లోపల్నుంచి మేనేజర్ గబగబా వచ్చి సాక్షాత్తూ ఆయన గదిలోకి 'తీసుకెళ్ళి, "టీ" అనగానే నేను "వద్దు" అనగానే "ఓ, ఎన్నారై కదా సారీ" అని ఆయన డ్రాయర్ లోంచి మినరల్ వాటర్ బాటిల్ ఇచ్చి సత్కరించాడు. అంతకు ముందే ఆ బాటిల్ లో నాలుగు చుక్కలు ఆయన తాగాడేమో అని నాకు అనుమానం వచ్చినా అప్పటికే అంతకు ముందు బ్యాంక్ లో తిన్న వడదెబ్బకి అదేం పట్టించుకునే స్థితిలో లేను. ఓ గుక్కెడు నీళ్ళు తాగి నా సంభాషణ లో మొదటి వాక్యంగా "ఐసిఐసిఐ" అంటే ఏమిటి సార్?" అని అడిగాను.

ఆయన బిక్క మొహం పెట్టి "నేను ఈ మధ్యనే ఇక్కడ చేరాను. కనుక్కుని చెప్తాను." అని ఆ ఇద్దరు కిచకిచలనీ, మిగతా వాళ్ళనీ అడిగితే వాళ్లూ వెర్రి మొహం పెట్టారు. కానీ అందులో మొదటి కిచకిచ తన సెల్ ఫోన్ లో అర్జంటుగా గూగుల్ చేసేసి సమాధానం చెప్పేసి అందరినీ సంతోష పెట్టింది. ఆ విధంగా ఇరకాటం నుంచి తప్పించుకున్న ఆ మేనేజర్ గారు ఎన్నారై –ఓ మరియు ఎన్నారై –ఇ అకౌంట్ల గురించి నాకు వివరంగా చెప్పి "ఇవాళ ఓ యాభై లక్షలతో ఎకౌంట్ ఓపెన్ చేద్దామా?" అని పుంజుకోబోయాడు. "అయ్య బాబోయ్ లక్ష డాలర్లే" అని నా గుండె గుభేలుమని మరో నాలుగు గుక్కలు తాగి "అమెరికా వెళ్ళాక మా క్వీన్ విక్టోరియా ని అడిగి పంపిస్తాను. ప్రస్తుతానికి ఈ ఐదు వేలు ఉంచండి" అన్నాను. అది విని ఆయన ముడుచుకు పోయి ఆ మినరల్ వాటర్ బాటిల్ నా చేతి లోంచి లాగేసుకుని హఠాత్తుగా లేచి నుంచున్నాడు. అప్పుడు మా మేనల్లు'డు నా డొక్కలో పొడిచి "లేదండి. ఒక్కో ఎకౌంట్ కీ పాతిక వేలో ఎంతో మీ మినిమమ్ ఎమౌంట్ ఉంటుంది కదండీ. ఆ మాత్రం తో ఎకౌంట్ ఓపెన్ చేస్తాడు మా మామయ్య" అని పరిస్థితిని చక్కబెట్టాడు.

రెండో గంట:

మొత్తానికి అక్కడ ఎకౌంట్ ఓపెన్ చెయ్యడానికి నన్ను వాళ్ళిద్దరూ ఒప్పించాక అప్లికేషన్ పూర్తి చెయ్యడం మేనేజర్ గారే మొదలు పెట్టాడు. అది మా ముత్తాత గారితో మొదలై, ఇంకా పుడతారో. లేదో తెలియని మనవల దాకా అన్ని వివరాలతో నేను నా ఆత్మ కథ రాసుకుంటున్న ఫీలింగ్ వచ్చేసింది. ఇక్కడ సరి కొత్త తతంగం ఏమిటంటే, ప్రతీ పేజీ మీదా నా సంతకం తో పాటు వేలి ముద్రలు కూడా వెయ్యాల్సి వచ్చింది. " ఈ రోజుల్లో అంతా బయో మెట్రిక్ పద్ధతులే సార్" అని సంజాయిషీ ఇచ్చుకున్నాడు పాపం మేనేజర్. తీరా అంతా అయ్యాక నేను డాలర్లు ఇవబోతుంటే, ఆయన నన్ను తీవ్రంగా వారించాడు. "మా బ్యేంక్ లో డాలర్లు వేస్తే మీకు రేటు ఒక రూపాయి తక్కువ వస్తుంది సార్..ఉండండి" అని ఫోన్ లో ఎవరితోనో మాట్లాడాడు. పది నిముషాలలో ఒక యువకుడు చేతి సంచీతో వచ్చి, "ఎన్ని డాలర్లు సర్?" అని అడిగి, లెక్కలు కట్టి, సంచీ జిప్ లాగి రూపాయల కట్టలు బయటకి తీశాడు. ఆ సంచీ లోపలికి చూస్తే సరి కొత్త రెండు వేల రూపాయల కట్టలే...కనీసం కోటి రూపాయలు ఉండి ఉంటాయి. నా జన్మలో అంత డబ్బు ఏనాడూ చూడని నా కళ్ళు జిగేల్ మన్నాయి. మళ్ళీ మినరల్ వాటర్ సీసా చేతులు మారింది. డాలర్లు, రూపాయలు కూడా చేతులు మారి మేనేజర్ గారి జేబులోకి వెళ్ళి పోయి...అక్కడి నుంచి కేషియర్ దగ్గరకి వెళ్ళింది. "మొత్తానికి నాచేత నా మొట్ట మొదటి ఎన్నారై ఎకౌంట్ తెరిపించారు. మా క్వీన్ విక్టోరియాకి ఫోన్ చేసి చెప్పాలి. ఏమంటుందో ఏమిటో మరి" అని మేనేజర్ తో సరదాగా అన్నాను.

"అప్పుడే కాదండి. ఇంకో పది హేను రోజులు టైము ఉంది లెండి." అన్నాడు మేనేజర్ యాధాలాపంగా.

"అంటే?" అన్నాను అర్థం గాక.

"అదేనండి, ఇప్పుడు మీ అప్లికేషన్ వైజాగ్ పంపిస్తాం, వాళ్ళు అన్నీ చూసి వెరిఫై చేసి అప్పుడు ఎకౌంట్ ఎప్రూవల్ పంపిస్తారండి. అంత వరకూ మీ ఎకౌంట్ ఓపెన్ అవదు. అయ్యాక అప్పుడు ఆవిడకి ఫోన్ చేసి అభిప్రాయం కనుక్కోండి."

"అంత వరకూ నా డబ్బు?" నేను విస్తుపోయాను.

"ఐసిఐసిఐ బ్యేంక్ వారి దగ్గరే క్షేమంగా ఉంటుందండి." మేనేజర్ నాకు భరోసా ఇచ్చాడు.

"మరి ఈ లోగా నాకు డబ్బు కావాలంటే?"

"వైజాగ్ హెడ్డాఫీసు నుంచి చెక్కులు, డెబిట్ కార్డ్ పంపించే దాకా ఆగాలి కదండీ.."

"చెక్కులు, ఆ కార్డ్ ఎక్కడికి పంపిస్తారు?"...నాకేదో భయం పట్టుకుంది.

"మీ అమెరికా అడ్రెస్ ఇచ్చారు కదండీ. అక్కడికే పంపిస్తారండి"

నా గుండె ఆగి పోయింది. మినరల్ వాటర్ సీసాలో చుక్క కూడా లేదు.

"మరి నేను ఇక్కడ కాకినాడలో ఉన్నాను కదా. చెక్కులు అమెరికా పంపిస్తే ఎలాగా?" కొంచెం నిస్సహాయం, కోపం నా గొంతులో చోటు చేసుకున్నాయి.

"కానీ మీరు ఎన్నారై కదండీ. ఇండియా అడ్రెస్ ఉండకూడదండి"

చెప్పొద్దూ.."ఓరి నాయనోయ్...నేను ఎన్నారై కాదు..నా పిండాకుడూ కాదు...ఇక్కడి వెధవనే.." అని గట్టిగా అరవాలి అనిపించింది నాకు.

అర గంట సేపు ఇద్దరం తర్జనభర్జన పడ్డాక...మొత్తానికి నాది స్పెషల్ కేస్ గా ఆ దిక్కుమాలిన చెక్కులూ, డెబిట్ కార్డూ కాకినాడ బేంక్ కే వైజాగ్ హెడ్డాఫీసు వాళ్ళు దయవుంచి పంపించాడనికి వాళ్ళని పిలిచి ఒప్పించి, పదిహేను రోజుల తరవాత అవన్నీ పట్టుకుని అమెరికా విమానం ఎక్కేశాను.

గత మూడు నెలలగా:

వైజాగ్ వారు పంపించిన డెబిట్ కార్డు, ఎకౌంట్ నెంబర్లు ఉపయోగించి సదరు ఐసిఐసిఐ వారి ఆన్ లైన్ లో నా ఎకౌంట్ రిజిస్టర్ చేసుకుని లాగ్ ఇన్ అవడానికి సుమారు రెండు వందల సార్లు ప్రయత్నించగా మొత్తానికీ విజయం సాధించాను. వారి వెబ్ సైట్ తో చాలా పెద్ద సమస్య ఏమిటంటే వాళ్ళ హోం పేజ్ రాగానే మూడు క్షణాలలో "సెక్యూరిటీ కారణాల వలన" ఆ పేజీ మూసుకు పోతుంది. అలాగే లాగ్ ఇన్ అవ్వాలన్నా మన "వాడుక పేరు" కానీ, పాస్ వర్డ్ కానీ మూడు సెకండ్స్ లో కొట్టక పోతే..అంతే సంగతులు. ఆ సైట్ అలిగి పారిపోతుంది. ఇలా లాభం లేదు అనుకుని వారి కస్టమర్ సర్వీస్ నెంబర్ పిలిచాను. అదొక పెద్ద జోకు. ఆ అమ్మాయో. అబ్బాయో ఆ దేశం లో ఎక్కడుంటారో తెలియదు కానీ ఒక్కొక్క సారి ఒక్కొక్క రకం

ఇంగ్లీషు...తెలుగింగ్లీషు, తమిలింగ్లీషు, గుజ్జూ, బెంగాలీ ఒకటేమిటి...నా బుర్ర ట్యూనింగ్ అంతా గత మూడు నెలలలోనూ దెబ్బ తినేసింది. వాళ్ళ మన ఎకౌంట్ చూడడానికి ముందు మా ముత్తాత గారి పేరు తో మొదలెట్టాలి. మన డెబిట్ కార్డ్ మన ఎదురుగుండా ఉండి, వెనకాల ఉన్న గళ్ల నుడికట్టులో అంకెలు విసుక్కోకుండా చెప్పగలగాలి. అలా ఒక గంట అయ్యేటప్పటికి మనం అసలు ఎందుకు పిలిచామో మర్చే పోతాం. పైగా మన సెల్ ఫోన్ పక్కనే పెట్టుకుని అలా చూస్తూ ఉండాలి. ఎందు కంటే ప్రతీ అడ్డమైన దానికీ వాళ్ళు ఒక కోడ్ ఆ ఫోన్ కి మాత్రమే పంపిస్తారు.

ఈ హింసలు అన్నీ భరిస్తూ గత మూడు నెలల్లో రోజుకు రెండు గంటలు ఆ బ్యేంక్ సైట్ పట్టుకుని ఆరు సార్లు మాత్రం విజయం సాధించాను. అన్నింటికీ పరాకాష్ట మొన్ననే జరిగింది. ఆఫీసులో కూచుని పొద్దున్న పద కొండు గంటలకి ఈ బ్యేంక్ ద్వారా ఇండియాలో మా మేనల్లుడికి కాస్త డబ్బు పంపిద్దాం అని కష్ట పడి లాగ్ ఇన్ అయాను. ఈ మూడు సెకండ్ల బారికి తట్టుకుంటూ పట్టు వదలని విక్రమార్కుడి లా వాడి సమాచారం అంతా ఎక్కించి డబ్బు బట్వాడా చెయ్యడానికి 'సెండ్" బటన్ నొక్క గానే ఠపీమని అక్కడి క్కడే మెసేజ్ వచ్చింది. దాని సారాంశం "ప్రస్తుతం మా ఆఫీసు మూసి యున్నది. కావున మా పని వేళలలో మళ్ళీ ప్రయత్నించండి. మా పని వేళలు ఉదయం పది నుండి సాయంత్రం నాలుగు వరకు. మధ్యాహ్నం 12 నుండి రెండు వరకు మా భోజన విరామం అని గమనించ గలరు"

అప్పటికే గంటన్నర కుస్తీ పట్టిన నాకు ఈ మెసేజ్ ముందు అర్థం అవలేదు. అంతా ఆన్ లైన్ కదా. కంప్యూటర్ కి భోజన విరామం ఏమిటీ? పైగా అది ఇండియా టైం ప్రకారం అంటే మాకు అర్థ రాత్రి కదా. అప్పుడు లేచి ఎన్నారైలు బ్యేంక్ పనులు చూసుకోవాలన మాట. వారెవ్వా?

నాకు ఒళ్ళు మండి వారి కష్టమర్ సర్వీస్ ని పిలిచి అన్ని అడ్డుగోడలూ దాటి ఒక కుర్రాడికి నా గోదు వినిపించాను. అతని సమాధానం నా కళ్ళు తెరిపించింది.

"మీ ఎన్నారై ల గురించి, అమెరికా వారి గురించీ ఇండియాలో కొన్ని కోట్ల మంది యువతీయువకులు రాత్రి అంతా పని చేస్తూ ఉంటే మీ సొంత ఎకౌంట్ మీరు చూసుకోడానికి రాత్రి ఒక సారి లేవ లేరా?"

అందుకే ఈ బ్యేంక్ లని "దేబ్యాం" అన్నాను..అంటే దేశీ బ్యేంక్ లు అనమాట. అవి నిజంగానే దేభ్యాలు....అనగా మా చిన్నప్పటి పరిభాషలో "ఎందుకూ పనికి రానివి"... కానీ భరించాలి, తప్పదు.

**COMMENTS**